


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కొన్ని కులాసా కబుర్లు

## ప్రయాణాలు

మనిషికి స్థానచలనం చాలా అవసరం. ఒక్క మనిషికేమిటి పశుపక్ష్యాదులకీ, ప్రాణం లేని వస్తువులకీ కూడా స్థాన చలనం తప్పదు. ఉదాహరణకి మనం పెరట్లో వదిలేసిన రుబ్బురోలునో, తిరగలిరాయినో చాలారోజులు కదపకుండా వదిలేసాం అనుకోండి, దాని క్రింద నాచుపట్టి, కొండకచో ఎర్రటి వానపాముల్లాంటి రోకలిబండలనే పురుగులు చుట్టచుట్టుకుని పడుకుని నానా కంగాళీగా తయ్యారవుతుంది!

ఇప్పుడు నేను చెప్పొచ్చేది ప్రయాణాల గురించి. ఎన్నడూ ఇల్లు కదలని వాళ్ళు కూడా ఎప్పుడో ఒకప్పుడు శుభకార్యాలనో, తీర్థయాత్రలనో, వినోదాలనో ఎవరైనా పోతే పరామర్శకనో ప్రయాణం చెయ్యడం తప్పని సరి. అలాంటప్పుడు మొదటగా చేసే పని సామాను సర్దుకోవటం. అది వాళ్ళ తెలివి తేటలని బట్టి ఉంటుంది. "లెస్ లగేజ్ మోర్ కంఫర్టబుల్" అని ఇంగ్లీషులో చెప్పి ఒప్పించాలని చూస్తుంటారు మనవాళ్ళు! మాతృభాషలో చెపితే కొన్ని సంగతులు చచ్చినా ఒప్పుకోం అని వాళ్ళ నమ్మకం!

సామాన్లు తెలివితేటల్ని బట్టి ఎందుకు అన్నానంటే ఎదురింటి ఆండాళమ్మగారు కాశీ ప్రయాణం అయితే లారీ అవసరం పడేటంత సామాను చేర్చింది. కుంకుడుకాయలు కొట్టే రాళ్ళ దగ్గర్నుండీ, ఆవకాయ జాడీల వరకూ!

ఇంక బారిష్టర్ పార్వతీశం అయితే పందపుల్లలూ, తాటాకు విసినకర్రలూ సైతం బంతిపూరంగు ట్రంకు పెట్టెలో సర్దడం మొక్కపాటివారు కళ్ళకు కట్టినట్లు చూపించారు.

మేము మా పిల్లాడి పుట్టు వెంట్రుకలు తీయించడానికి తిరుపతి ప్రయాణం అయ్యాం. మా అత్తగారు నాలుగు రోజులు ముందు నుండీ పిల్లాడికేం అవసరమో నా చేత దగ్గరుండి సర్దించారు. మా ఆయనైతే ఒక్కసారిగా తండ్రి అవడం ఎంత బాధ్యతో గుర్తించి, పాకిస్తాన్, ఇండియాలు ఒకేసారి మాకు ప్రెసిడెంట్ గిరీ చేయాలని కోరితే కంగారు పడినట్లు, కాళ్ళూ చేతులు ఆడక కంగారు పడిపోయారు.

కాలెండర్లు చూసి మంచి రోజు చూసారు. అనుమానం తీరక మావిళ్ళవారి పంచాంగం తెప్పించారు. తర్వాత ఎందుకొచ్చిన గొడవని మా ఇంటి పురోహితుడ్ని అడిగారు. ముహూర్తం పెట్టుకుని రిజర్వేషన్ చేయించారు.

ఆరోజు రానే వచ్చింది. మా వారు తెల్లవారి ఆరుగంటలనుండే సామానంతా సర్దారు. పెట్టెలకి తాళాలు వేసారు. మళ్ళీ అనుమానాలొచ్చి తాళాలు తెరిచారు. చక్కగా సర్దిన బట్టలవీ కిందా మీదా చేసి కెలికారు. మళ్ళీ తాళాలు వేసారు. ఆ తాళాలు ఎక్కడ

పెడుతున్నారో నాతో చెప్పారు. కానీ యధాప్రకారం అవి అక్కడ పెట్టకుండా ఇంకెక్కడో పెట్టారు. దుప్పటీ అనీ, ఫ్లాస్కు అనీ, ధర్మామీటర్ అనీ, పట్టు పంచెలనీ ఏదో ఒక బుట్టలో, సంచిలో కుక్కుతూనే ఉన్నారు. సాయంత్రం ఐదున్నరకి వెంకటాద్రి ఎక్కాల్సిన మాటైతే, మధ్యాహ్నం రెండింటికే సామానంతా వరండాలో చేర్చేసి ఆపసోపాలు పడ్డారు.

తలంటు పోసుకుని అత్తగారు వండిన ఆవపెట్టిన అరటికాయ కూరతో అన్నం తిని సుఖంగా నిద్రపోతున్న నన్ను మూడున్నరకల్లా లేపి "బయలుదేరు...బయలుదేరు.." అన్నారు. "దానికి అసలే నిద్దరెక్కువ... సామాను రైల్లో జాగ్రత్తరా... పిల్లాడి కాళ్ళకి వెండి కడియాలున్నాయి... చేతికి మురుగులున్నాయి... మెడలో పుష్పరాగం గొలుసుంది!" అని మా అత్తగారు జాగ్రత్తలు చెపుతూనే ఉన్నారు. నేను మొహం కడుక్కుని మా అమ్మ పెట్టిన కనకాంబరం రంగు చీర కట్టుకుని, పెరట్లో పూసిన కనకాంబరాలు మాల కట్టి పెట్టుకుని, ఎదురింటావిడకి చెప్పి, పక్కింటావిడకి చెప్పి, పాలుపోసే అతనికి చెప్పి, పని మనిషికి చెప్పి ఆటో ఎక్కాను.

మా ఆయన సామాను అప్పటికే పదిసార్లు లెక్క పెట్టారు "గోవిందరాజుల స్వామి గుడి కెళ్ళండి... తిరుచానూరు మరిచిపోవద్దు.. నాకు పళ్ళు లేకపోయినా నానపెట్టుకు తింటాను.... వడ తెండి" అని మా అత్తగారు చెపుతుంటే, "మళ్ళీ వచ్చాక మిగతావి వింటాలేవే!" అని "పోనీవయ్యా.. బాబూ" అని ఆటోవాడిని విసుక్కుని ఆటోని పోనిచ్చారు.

హైదరాబాద్ ట్రాఫిక్ ఇరవై ఏళ్ళ క్రితం కూడా ఏం తక్కువలేదు. మేం చేరేసరికి నాలుగున్నర.

"చూసావా... నాలుగో నెంబరుకి నడిచి వెళ్ళాలి ... పద.. పద..." అని తొందర చేస్తూ సామాన్లు దించారు.

సామానంతా లెక్క పెట్టి నేను "కెవ్వు" మన్నాను. "ఏమైంది? పిల్లాడికేవైనా అయిందా?" ఆయన వాడి ఒళ్ళు నిమురుతూ కంగారు పడ్డారు.

"బుట్టేదండీ?" అంటూనే నేను ఆటో అతని మీద గయ్యిమన్నాను. "ఏవయ్యా? అంత తొందరేం? సామానంతా పెట్టేదాకా ఆగలేవా? " అని

"మీరే కదా అమ్మా పోనీ పోనీ అన్నరూ... నా డబ్బులిచ్చెయ్యండి...." అన్నాడతను.

మా ఆయన నామీద గయ్యిమన్నారు... "నీకంతా తొందర మేళం... ఆటో రాగానే ఎక్కి కూర్చోడమేనా? సామాను చూసుకోవద్దా? ఇప్పుడు ఇంటికి వెళ్ళి రాడానికి కూడా టైం లేదు. వెళితే ట్రాఫిక్‌లో చిక్కుకుపోతాం... ఇంతకీ బుట్టలో ఏం ఉన్నాయి?"

"బుజ్జిగాడి పాలడబ్బా, వేడినీళ్ళ ఫ్లాస్కు, సీసా, ఆయిల్ క్లాతూ, మందులూ, నా ముడుపులూ..."

"నీ శార్ధం... నావసినికాడూ" ఇంత ముఖ్యమైనవి పెట్టిన బుట్టనా మర్చిపోతావ్?!?" అని నా మీద ఎగిరిపడ్డారు. మర్చిపోయేటప్పుడు ముఖ్యం కానిది చూసి మర్చిపోవాలి అనేట్లు.

"మరి మీరు పదిసార్లు అన్నీ చెక్‌చేసారుగా!" అని రెట్టించాను. అప్పటికే నాకు కంగారూ, ఏడుపూ రెండూ తన్నుకొస్తున్నాయి.

"పద! ... ఏదో ఒకటి చేద్దాం." నీరసంగా అన్నారు. పవర్ అంతా దిగిపోయిన పొలిటీషియన్లా.

"రాత్రి బాబుకి పాలు పట్టాలండీ" అన్నాను.

"అందుకే... అందుకే అసలు"... అని పళ్ళు నూరుతూ చిన్నగా "పెళ్ళి చేసుకోకూడదు" అన్నారు.

"నేనేమైనా వెంటపడి అడిగానా?" అని నేనూ ఎదురుదాడికి సిద్ధం అవుతుండగా!

"ఇక్కడున్నారామ్మా..." అన్న మా పనిమనిషి కేక వినిపించింది! వెనకాలే బుట్ట గుండెలకి హత్తుకుని పరుగులు పెడుతూ వస్తున్న మా ఆడబిడ్డ కనిపించింది. ఆ సమయంలో వరలక్ష్మీ వ్రతం నేను నిష్టగా చేసిన ఫలితానికి నా ఒంటినిండా బంగారం వచ్చినట్లు పొంగిపోయాను.

"నయం... ఇంకా బయటే ఉన్నారు.. ఆ మహాసముద్రంలో ఎక్కడ వెతకాలో అని భయపడుతూ వచ్చాను... పోనీలే అని ఊరుకుందాం అంటే మరొకటీ, మరొకటీ కాదు కూడానూ!" అంటున్న ఆడబిడ్డ కల్పవృక్షంలా కనిపించింది!

ఇలా ప్రయాణాల్లో ఎక్కువ సామాన్లు చేర్చుకుని ఇబ్బందులు పడేవాళ్ళు కొందరైతే.... ఎంత దూరం అయినా తేలిగ్గా చిన్న పెట్టెతో వెళ్ళొచ్చేవాళ్ళు ఇంకొందరు!

మా తాతగారు సూరంపూడి శ్రీహరిరావుగారు ఆన్ ఫూట్ బ్యాచ్ అని ఎనిమిది అంది కుర్రాళ్ళతో కాలినడకన కాంగ్రెస్ మీటింగ్‌కి రాజమండ్రి నుండీ లక్నో బయలుదేరారు. ఆయన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు. ఆయనతో గ్రేట్ లేడీ మా అమ్మమ్మ వెంకట రమణమ్మ కూడా, ఏడాది చంటిపిల్లని చంకనేసుకుని బయలుదేరింది. అప్పుడు ఆవిడ వయసు పద్దెనిమిది సంవత్సరాలు. ఐదు నెలలకు పైగా నడిచి రకరకాల సత్రాలలో, దేవాలయాలలో బస చేస్తూ, నడిచి గాంధీగారిని చేరుకున్నారు.

ఇంతకీ అంతమంది మగాళ్ళ మధ్యలో ఒంటరి ఆడది చంటిపిల్లతో తీసుకెళ్ళిన సామాను ఏమిటో తెలుసా?

ఆవిడ స్వయంగా మోయగలిగేటంత చిన్న ట్రంకు పెట్టెలో, రెండు ఖద్దరు చీరలు, పిల్లకి గౌనులు,, ఉగ్గుగిన్నె, ఆడమనిషి కాబట్టి బొట్టుపెట్టె, కాటుక కాయా, జీలకర్ర, ధనియాలూ, ఎండుమిరపకాయా, బెల్లం, కరివేపాకూ కలిపి నూరిన గుండ.... గిన్నెలో వేడినీళ్ళు పెట్టి ఇది చెమ్చాడు వేస్తే పిల్లకి చారు తయ్యారు అనమాట! ఇవీ ఆవిడ సామాన్లు!

అడవిలో కుండతో అన్నం వండి, బండమీద చింతకాయలూ, ఉప్పూ, పచ్చిమిరపకాయలూ వేసి ఇంకో బండతో నూరి సవారి పచ్చడి చేసి అందరికీ కడుపులు నింపిన ఇల్లాలావిడ!

మా అమ్మమ్మ మన సాహితీ ప్రయాణంలో అడుగడుగునా తగులుతూనే ఉంటుంది లెండి...వండ్రఫుల్ లేడీ!

❀❀❀

